

మొక్కజొన్నకే మొగ్గు

రైతులు జీరో టిల్లేజ్(దుక్కి లేకుండా మొక్క జొన్న సాగు)వైపు మొగ్గు చూపుతున్నారు. అధిక దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. 8లో



అట్టహాసంగా ఎస్‌పీఎల్‌ టోర్నీ

సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభమైంది. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్‌

పరీక్షలకు సన్నద్ధం చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌ రాజ్‌

భద్రాచలం: విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని గురుకులాల ఇన్‌చార్జ్‌ ఆర్సీఓ, ఐటీడీఏ ఏపీఓ జనరల్‌ డేవిడ్‌ రాజ్‌ అన్నారు. శనివారం ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులను ఇళ్లకు పంపించొద్దని, వెళ్లినవారు పాఠశాలలకు వచ్చేలా తల్లిదండ్రులతో మాట్లాడాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి, వైద్య పరీక్షలు చేయించాలని ఆదేశించారు. ప్రతి శనివారం సబ్జెక్టులపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. సిలబస్‌ రివిజన్‌ ప్రారంభించి ఫిబ్రవరి వరకు పూర్తి చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్‌ విద్యార్థులకు టైంటేబుల్‌ ప్రకారం స్పెషల్‌ టెస్టులు నిర్వహించాలన్నారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు, పదో తరగతిలో విద్యార్థులందరూ జీపీఏ 10 సాధించేలా కృషి చేయాలని అన్నారు.

ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ..

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ జనక్‌ ప్రసాద్‌



నియామక పత్రం ఇస్తున్న జనక్‌ ప్రసాద్‌ తదితరులు

ఇల్లెందు: బీఆర్‌ఎస్‌ తీరు ఢిల్లీలో దోస్తీ–గల్లీలో కుస్తీ చందంగా ఉందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్‌ జనక్‌ ప్రసాద్‌ విమర్శించారు. శనివారం ఇల్లెందులోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు లింగాల జగన్నాథానికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లెందులో ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలని చెప్పారు. ఐఎన్‌టీయూసీతోనే సింగరేణి మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. 2015లో కేంద్రంలోని మోదీ సర్కార్‌ తెచ్చిన ఎంఎండీఆర్‌ చట్టంతో ఖనిజ సంపద కార్పొరేట్‌ శక్తులకు బహిరంగ టెండర్ల ద్వారా ధారాదత్తం చేసే అవకాశం లభించిందన్నారు. అప్పుడు టీఆర్‌ఎస్‌కు ఉన్న 13 మంది ఎంపీలు చట్టాలకు మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పుడు పూసపల్లి మైన్స్‌ను ప్రైవేట్‌ కాంట్రాక్టర్‌ దక్కించుకుంటే పోరాడుతామని ఫోజులు కొడుతున్నారని విమర్శించారు. పూసపల్లి ఓసీని ప్రైవేట్‌ వారు పని చేయకుండా అడ్డుకునే సత్తా టీబీజీకేఎస్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి త్యాగరాజు, డాక్టర్‌ శంకర్‌ నాయక్‌, బ్రాంచీ కార్యదర్శి కన్నయ్య, అన్వర్‌, భూక్యా దళ్‌సింగ్‌నాయక్‌, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తిరుగుబాటు!

కొత్తగూడెం మున్సిపాలిటీలో అవిశ్వాసం?

- ఈ నెల 27తో పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి
- చట్టపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో కార్యాచరణ
- అసమ్మతివర్గంలో 12 మంది కౌన్సిలర్లు, శనివారం సుదీర్ఘ భేటీ..
- ఏడాది కాలంగా ప్రతిపక్ష పాత్రలో అధికార సభ్యులు



కొత్తగూడెం మున్సిపల్‌ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గంలో నెలకొన్న అసమ్మతి తారాస్థాయికి చేరిందా? చైర్‌ పర్సన్‌ కాపు సీతాలక్ష్మికి వ్యతిరేకంగా గళం విప్పుతున్న కౌన్సిలర్లు తిరుగుబాటుకు పావులు కదుపుతున్నారా ? అంటే అవుననే సమాధానమే వస్తోంది. పాలవర్గం ఏర్పడి మూడేళ్లు గడిచిపోవడంతో అసమ్మతి కౌన్సిలర్లు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

స్వపక్షమే విపక్షం..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉన్నాయి. మూడేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ 25, సీపీఐ 8, కాంగ్రెస్‌ ఒక వార్డులో విజయం సాధించగా ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. ఫుల్‌ మెజార్టీ రావడంతో బీఆర్‌ఎస్‌ తరఫున చైర్‌ పర్సన్‌గా కాపు సీతాలక్ష్మి ఎన్నికయ్యారు. కొత్త పాలక వర్గం ఏర్పాటై ఏడాది కాలం ముగిసిన తర్వాత లుకలుకలు మొదలయ్యాయి. క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహణ విషయంలో రాజుకున్న అసమ్మతి పెరుగుతూ వచ్చి వారాంతపు సంత, డెయిలీ మార్కెట్‌ టెండర్ల అంశంతో ముదిరిపాకాన పడింది. బీఆర్‌ఎస్‌ పార్టీ తరఫున మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఉండగా అసమ్మతి వర్గంలోకి 12 మంది కౌన్సిలర్లు చేరారు. మున్సిపాలిటీ సాధారణ సమావేశాల్లో అసమ్మతి నేతలే ప్రతిపక్ష పార్టీ పోషిస్తూ ప్రజా సమస్యలపై గళం విప్పుతూ, ధర్నాలు చేస్తూ వస్తున్నారు.

మూడేళ్లు నిండటంతో..

స్థానిక సంస్థల్లో పాలక మండలి ఏర్పడిన తర్వాత మూడేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టరాదనే చట్టం అమల్లో ఉంది. 2023, జనవరి 27తో కొత్తగూడెం మున్సిపల్‌ పాలక వర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తయింది. దీంతో చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఫలితంగా ఇంతకాలం మున్సిపల్‌ చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఉన్న అసమ్మతి నేతలు మరో అడుగు ముందుకు వేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు రెడీ అవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు శనివారం సాయంత్రం అసమ్మతి వర్గం కౌన్సిలర్లు ప్రత్యేకంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలుస్తోంది.

అవిశ్వాసమే వస్తే..

కొత్తగూడెం మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉన్నాయి. అవిశ్వాస తీర్మానం గట్టెక్కాలంటే 19 మంది కౌన్సిలర్ల మద్దతు కావాలి. అవసరమయితే ఎక్స్‌ అఫిషియో సభ్యుల సహకారం తీసుకునే వీలుంది. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 25 మంది కౌన్సిలర్లు ఉండగా ఇందులో 12 మంది అసమ్మతి వర్గంగా ముద్రపడ్డారు. చైర్‌పర్సన్‌కు మద్దతుగా 13 మంది బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. దీంతో ఎనిమిది సభ్యులు ఉన్న సీపీఐ, ఒక కాంగ్రెస్‌, ఇద్దరు ఇండిపెండెంట్‌ కౌన్సిలర్ల మద్దతు కీలకంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా సీపీఐ కౌన్సిలర్లు ఎటువైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారనుంది.

పాలకవర్గంలో సఖ్యత కరువు

ఏడాదిన్నర కాలంగా కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గంలో సఖ్యత కరువైంది. కౌన్సిలర్ల మధ్య రాజీ కుదిర్చేందుకు స్థానిక ఎమ్మెల్యే వనమా తన వంతు ప్రయత్నం చేసినా పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోయారు. రోజురోజుకు ఈ సమస్య చినికిచినికి గాలివానలా మారుతూనే ఉంది. మరోవైపు ఇటు జిల్లా పార్టీ నేతలు కానీ, అటు ఉమ్మడి జిల్లా స్థాయిలో పార్టీ పరంగా పెద్ద దిక్కుగా ఉన్న నాయకత్వం కానీ కౌన్సిలర్ల మధ్య సఖ్యత కోసం చేసిన ప్రయత్నాలు తక్కువే. ఫలితంగా ఈ సమస్య ముదిరి ఏకంగా అవిశ్వాస తీర్మానం వరకు వచ్చినట్టయ్యింది. మరిప్పుడు బీఆర్‌ఎస్‌ పార్టీ పెద్దలు ఎలా స్పందిస్తారనేది ఆసక్తిగా మారింది.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

మున్సిపాలిటీ పాలకవర్గంలో అసమ్మతి ఉంది. ఒక వేళ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే పరిస్థితి ఎదురైతే పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాను. ఎమ్మెల్యే వనమా, మంత్రి కేటీఆర్‌, సీఎం కేసీఆర్‌ సూచనలకు అనుగుణంగా నడుచుకుంటాను.

–కాపు సీతాలక్ష్మి, చైర్‌పర్సన్‌, కొత్తగూడెం మున్సిపాలిటీ

బదిలీల సందడి



వెరిఫికేషన్‌ చేస్తున్న సిబ్బంది



వెరిఫికేషన్‌కు వచ్చిన ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయుల ప్రమోషన్‌, బదిలీల ప్రక్రియతో కోలాహలం
- జిల్లాలో 1,563 మంది అర్హులు..
- ఇంకా బాధ్యతలు చేపట్టని నూతన డీఈఓ
- అందుబాటులోలేని ఎంఈఓలు

కొత్తగూడెంఅర్బన్‌: ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభం కావడంతో సందడి నెలకొంది. ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమవుతున్నా సరైన మార్గదర్శకాలు లేక, అధికారులు అందుబాటులో లేక కొంత అయోమయానికి గురవుతున్నారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి పాఠశాలలో పది కౌంటర్లు ఏర్పాటు చేయగా అర్హులైన ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల కోసం తమ వద్ద ఉన్న అర్హత పత్రాలతో దరఖాస్తు చేసుకున్నారు. అప్పీలు, కరెక్షన్‌, స్క్రూటినీ ప్రక్రియలకు సంబంధించి రెండు, మూడు ఫార్మేట్లు ఉండటంతో ఏది సరైనదో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యాశాఖ అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. వెరిఫికేషన్‌ ప్రక్రియ జరుగుతున్న క్రమంలో ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఎంఈఓలు అందుబాటులో లేరు. శనివారం ఎల్‌ఎఫ్‌ఎల్‌, ఫిజిక్స్‌, ఇంగ్లిష్‌, మ్యాథ్స్‌ ఉపాధ్యాయులు 500 మందికి పత్రాల వెరిఫికేషన్‌ చేశారు. ఇంకా కౌంటర్ల సంఖ్య పెంచాలని, ముఖ్యంగా అప్పీలు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. సోమవారం బయాలజీ, సోషల్‌ ఉపాధ్యాయులకు వెరిఫికేషన్‌ ప్రక్రియ జరగనుంది.

1,563 మంది అర్హులు..

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4 వరకు కొనసాగనుండగా, జిల్లాలో దాదాపు 1,563 మంది వరకు అర్హులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిశీలకులుగా నియమితులైన వెంకటనర్సమ్మ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఉపాధ్యాయుల దరఖాస్తులు, వెరిఫికేషన్‌, స్క్రూటినీ, తిరస్కరణ, అర్హుల జాబితా, అభ్యంతరాలు, ఫైనల్‌ జాబితా ఇలా ప్రక్రియ మార్చి వరకు కొనసాగనుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

విధుల్లో చేరని డీఈఓ..

జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మను బదిలీ చేసి, ఆయన స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న రవికాంతారావును నియమించారు. కానీ కొత్త డీఈఓ ఇంకా విధుల్లో చేరలేదు. దీంతో సోమశేఖర శర్మే ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కీలక సమయంలో రెండు చోట్ల పని చేయడం భారంగా మారడంతోపాటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్త డీఈఓ త్వరగా బాధ్యతలు చేపట్టేలా, ఎంఈఓలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్‌ చేస్తున్నారు.

కౌంటర్ల సంఖ్య పెంచాలి



ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలకు సంబంధించిన ప్రక్రియలో కౌంటర్ల సంఖ్య పెంచాలి. నీటి సదుపాయం ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు ఏ ఫార్మేట్‌లో దరఖాస్తులు చేసుకోవాలో అధికారులు స్పష్టత ఇవ్వాలి.

–వెంకటేశ్వర రావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

మళ్లీ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే..

- అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం భేష్‌
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



చెక్కు అందిస్తున్న ఎంపీ నామా, ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌ పార్టీకే ప్రజలు పట్టం కడతారని, వందశాతం మళ్లీ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వమే ఏర్పడుతుందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు జోస్యం చెప్పారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి 37 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.13 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేశారు. తొలుత జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఏర్పడి మూడోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ ప్రమాణ స్వీకారం చేసి హ్యాట్రిక్‌ సాధిస్తారని పేర్కొన్నారు. విద్యుత్‌, సాగు నీరు, వ్యవసాయం, రహదారులు, కరెంట్‌ సమస్యలను దాదాపుగా పరిష్కరించామని, కేవలం పోడు సమస్య మాత్రమే పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమస్యను కూడా సీఎం త్వరలోనే పరిష్కరిస్తారని అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించి, భేష్‌గా ఉందని పేర్కొన్నారు. మన సంక్షేమ పథకాలపై కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని, తమను తెలంగాణలో కలపాలని కోరుతున్నారని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌ పూర్తైతే ప్రతి ఎకరాకు సాగు నీరు అందుతుందన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కొందరు డబ్బులు, మాయ మాటలతో మోసం చేసేందుకు వస్తుంటారని ఇలాంటి వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుపై నియోజకవర్గ ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని, సర్వేలో కూడా ముందంజలో ఉన్నారని, ఈ విషయాన్ని స్వయంగా సీఎం కేసీఆరే చెప్పారని వివరించారు. అనంతరం నారాయణపురం గ్రామంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. జమ్మిగూడెంలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరై దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్‌ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, దమ్మపేట జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు అట్టం రమ్య, సాధు జ్యోత్స్నబాయి, బీఆర్‌ఎస్‌ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, ఎస్‌కే ముబారక్‌ బాబా, బిర్రం వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, యూఎస్‌ ప్రకాశ్‌, చిన్నంశెట్టి వెంకటనరసింహ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్‌: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తగూడెం కళాశాల ప్రిన్సిపల్‌ బి.రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, విద్యార్థినులకు 34 సీట్లు, ఎస్సీ, బీసీ, మైనారిటీ, క్రీడాకారులకు ఆరు సీట్లు కేటాయిస్తామని వివరించారు. తల్లిదండ్రుల సంవత్సరాదాయం రూ.1.50 లక్షలకు మించొద్దని, వివరాలకు 81062 57520, 99518 30441లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

ఎస్పీ డాక్టర్‌ వినీత్‌



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్‌ వినీత్‌

కొత్తగూడెంటౌన్‌: సిబ్బంది, అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ డాక్టర్‌ వినీత్‌ సూచించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్ర పోలీస్‌ శాఖలో అమలు అవుతున్న వర్టికల్స్‌పై ఆయన మాట్లాడారు. అందరూ తమ రోల్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. వివిధ సమస్యలతో పోలీస్‌ స్టేషన్‌కు వచ్చే బాధితులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుశాఖలో వినియోగిస్తున్న సాంకేతికత పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వర్టికల్స్‌ వారీగా నిర్వర్తించే విధులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. రిసెప్షన్‌, బ్లూకోల్ట్స్‌, కోర్టు, ఇన్వెస్టిగేషన్‌ అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు, వారెంట్స్‌, ట్రాఫిక్‌, టెక్‌ టీం, డయల్‌ 100, కమ్యూనిటీ పోలీసింగ్‌, సైబర్‌ క్రైమ్‌ వంటి విభాగాల్లో పని చేసే అధికారులు అలసత్వం వహించొద్దని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘మారెళ్లపాడు’తో సస్యశ్యామలం

- అశ్వాపురం మండలానికి సీతారామ ప్రాజెక్ట్‌ నీరు
- నేడు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- 17 వేల ఎకరాలకు అందనున్న గోదావరి జలాలు



అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు

అశ్వాపురం: ఎట్టకేలకు సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా అశ్వాపురం మండలంలోని రైతాంగానికి సాగునీరు అందించేందుకు నేడు తొలి అడుగు పడనుంది. మండలంలోని 17 వేల ఎకరాలకు గోదావరి జలాలు అందించేలా రూ.25 కోట్లతో చేపడుతున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకానికి ఆదివారం బీజీ కొత్తూరు గ్రామంలోని సీతారామ ప్రాజెక్ట్‌ పంప్‌హౌస్‌ వద్ద ప్రభుత్వ విప్‌, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేయనున్నారు.

17 వేల ఎకరాలకు సాగునీరు..

అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం గ్రామంలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి దూరప్రాంతాలకు గోదావరి జలాలు అందించేందుకు ప్రభుత్వం సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టింది. పథకం కోసం ఈ ప్రాంత భూములు తీసుకుని, ఇక్కడి రైతులకు చుక్క సాగునీరు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు నిరాశ చెందారు. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.25 కోట్లతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఉపక్రమించింది. 17 వేల ఎకరాలకు సాగునీరు అందించనుంది. మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్‌ ప్రధాన కాలువకు అనుబంధంగా పంప్‌హౌస్‌ నిర్మించనున్నారు. గొందిగూడెం గ్రామంలో డెలివరీ సిస్టం ఏర్పాటు చేసి పంప్‌హౌస్‌ నుంచి పైపులైన్‌ ద్వారా నీరు డెలివరీ సిస్టంకు తరలిస్తారు. అక్కడి నుంచి కాలువ ద్వారా మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలిస్తారు. మరో కాలువ ద్వారా అశ్వాపురంలోని చింతలచెరువు, జగ్గారంలోని ఎర్రబొక్కల చెరువు, మిట్టగూడెంలోని తీగల చెరువుకు, మణుగూరు మండలంలోని తోగ్గూడెం, రేగులగండి చెరువులకు సాగునీటి జలాలు తరలించనున్నారు.



గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్‌ ప్రధాన కాలువ

తీరనున్న రైతుల చిరకాల వాంఛ

జిల్లాలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన, కాకతీయుల కాలం నాటి తమ్మల చెరువు కింద 10 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు ఆధారంగా వేల మంది రైతులు, రైతు కూలీలు వ్యవసాయం చేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్నారు. కానీ వర్షాలు కురిస్తేనే చెరువు నిండి రెండు పంటలు పండి రైతులు సంతోషంగా జీవిస్తారు. వర్షాలు కురవకపోతే కరువు పరిస్థితులు తప్పడం లేదు. దీంతో తుమ్మల చెరువుకు గోదావరి జలాలు తరలించాలని రైతులు ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ హయాంలో రాజీవ్‌సాగర్‌ ప్రాజెక్ట్‌ ద్వారా తుమ్మలచెరువు గోదావరి జలాలు తరలించేలా ప్రతిపాదనలు చేశారు. రీడిజైన్‌లో చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్‌ ద్వారా ఈ ప్రాంత రైతాంగానికి నీరు అందే పరిస్థితి లేకపోవడంతో రైతులు స్థానిక, ఎమ్మెల్యే, మంత్రులకు పలుమార్లు విన్నవించారు. ప్రభుత్వ విప్‌, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించనున్నారు.

ఎంతో ఉపయోగం..



తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించాలని రైతుల కోరిక. గతంలో బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్‌ పంప్‌హౌస్‌ నిర్మాణానికి భూములు ఇవ్వాలంటే తుమ్మలచెరువుకు గోదావరి జలాలు తరలించాలని ప్రభుత్వానికి విన్నవించాం. ప్రభుత్వ విప్‌, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో లిఫ్ట్‌ మంజూరైంది. ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగం.

–మర్రి మల్లారెడ్డి, సర్పంచ్‌ మొండికుంట

17 వేల ఎకరాలకు సాగునీరు

సీతారామ ఎత్తిపోతల పథకంలో అదనపు ఆయకట్టుకు నీరు అందించేందుకు నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 17 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీని ద్వారా అశ్వాపురం మండలంలో తుమ్మలచెరువు, చింతలచెరువు, ఎర్రబొక్కలచెరువు, తీగలచెరువుల ద్వారా ఆయకట్టుకు నీరు అందించవచ్చు.

–శ్రీనివాస్‌, డీఈ, మణుగూరు, జలవనరులశాఖ

భద్రగిరికి పోటెత్తిన భక్తులు

- ఘనంగా సువర్ణ తులసీ అర్చన
- నేటితో ముగియనున్న రామదాసు జయంతి ఉత్సవాలు





కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌) స్వామి వారికి కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రగిరి పుణ్యక్షేత్రం శనివారం భక్తులతో సందడిగా మారింది. వారాంతపు సెలవు దినం, రథసప్తమి కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారి మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారి నిత్యకల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. సువర్ణ తులసీ అర్చన, నిత్యకల్యాణ వేడుకల్లో కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా వెండి రథ సేవ

శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం రథ సప్తమి వేడుకలను ఘనంగా జరిపారు. స్వామి వారిని వెండిరథంలో కొలువుదీర్చి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి హారతి సమర్పించారు. ఈఓ బి.శివాజీ, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన వాగ్గేయకారోత్సవాలు

ఆలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో భక్తరామదాసు జయంతి ఉత్సవాలు నాలుగో రోజు కొనసాగాయి. వాగ్గేయకారోత్సవాల్లో భాగంగా శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎంవీ కమలార మణి, ఎస్‌ రామమూర్తి బృందం, హైదరాబాద్‌కు చెందిన శేషాచారి, రాఘవాచారి తదితరులు శాస్త్రీయ సంగీత ప్రదర్శన చేశారు. ఆదివారంతో వాగ్గేయకారోత్సవాలు ముగియనున్నాయి. కాగా నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని గుంటూరుకు చెందిన భక్తులు ఠాకూర్‌ రామ్‌కిషన్‌ సింగ్‌, లక్ష్మీదేవి రూ. లక్ష విరాళం అందించారు. ఆలయ సూపరింటెండెంట్‌ నిరంజన్‌ పాల్గొన్నారు.

రెండు రోజులు నిత్యకల్యాణాలు నిలిపివేత

మాఘమాసంలో స్వామి వారికి జరిగే పూజాది కార్యక్రమాల్లో భాగంగా 4,5వ తేదీల్లో సహస్రకలశాభిషేకం జరపనున్నట్లు ఆలయ ఈఓ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు నిత్యకల్యాణాలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

జిమ్ క్రీడాకారులకు బంగారు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ వినీత్

భద్రాచలంఅర్బన్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 15 నుంచి 20 వరకు జరిగిన జాతీయస్థాయి బెంచ్‌ప్రెస్ పోటీలలో భద్రాచలం పట్టణంలోని సిటీస్టైల్ జిమ్ క్రీడాకారులు రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీలలో 84 కేజీల విభాగంలో మహమ్మద్ అబ్బాస్, 105 కేజీల విభాగంలో గాలి రామ్మోహన్‌రావు బంగారు పతకాలు సాధించారు. 74 కేజీల విభాగంలో మహంతి వెంకటకృష్ణ ఎనిమిదో స్థానంలో నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులతోపాటు కోచ్ రామిరెడ్డిని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోగాల శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.మల్లేశ్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.వసంతరావు, ట్రెజరర్ బోగాల వీరారెడ్డి అభినందించారు. క్రీడాకారులను ఎస్పీ వినీత్ ప్రత్యేకంగా అభినందించారు.

మొరాయిస్తున్న '108'



అంబులెన్స్‌ను ట్రాక్టర్ సాయంతో లాగుతున్న దృశ్యం

గుండాల: ఒక్క ఫోన్‌కాల్‌తో ప్రాణాలు కాపాడే సంజీవనికే సాయం కావాల్సి వస్తోంది. గుండాల పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే 108 అంబులెన్స్ ఎక్కడపడితే అక్కడే మొరాయిస్తోంది. దీంతో అత్యవసర సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం తెల్లవారుజామున సాయనపల్లి వెళ్లాల్సిన 108 మార్గమధ్యలో నిలిచిపోయింది. ఎంతసేపటికీ కదలక కాకపోవడంతో అంబులెన్స్‌కు తాడు కట్టి ట్రాక్టర్ సాయంతో ఆస్పత్రికి చేర్చారు. ఇలా చాలాసార్లు మొరాయించిన ఘటనలు నెలకొన్నాయి. అప్పటికప్పుడు ఆళ్లపల్లి, టేకులపల్లి మండలాల 108 వాహనాలకు సమాచారం ఇచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలకు మరమ్మతులు చేయించకపోవడంతో నిత్యం ఆగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త 108 వాహనాన్ని మండలానికి కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: సేంద్రియ పద్ధతుల్లో ఆయిల్‌పాం సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక గిరిజనభవన్‌లో నిర్వహించిన ఈ సదస్సులో యూఏఎల్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రపాణి మాట్లాడుతూ.. సేంద్రియ విధానం ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చన్నారు. రసాయనిక ఎరువులను వినియోగించడం వల్ల నేల స్వభావం క్షీణించి పంటకు నష్టం చేస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య, ఆళ్ల నాగేశ్వరరావు, తుమ్మా రాంబాబు, ప్రైవేటు కంపెనీ డైరెక్టర్లు అబ్రహం, శంకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఉపాధ్యాయుడు మృతి

చర్ల: మండల కేంద్రంలోని ఉంజుపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆరెం నాగార్జున (40) ఈ నెల 12న ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన కరకగూడెం మండలంలోని మొగిలితోగు గ్రామానికి తీసుకురాగా ఉంజుపల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.సాయన్న, పీడీ ఈశ్వర్‌రావు ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సత్యనారాయణ, ప్రకాశ్ తదితరులతో పాటు విద్యార్థులు కూడా వెళ్లి నివాళులర్పించారు. దహన సంస్కారాల కోసం రూ.20 వేలు అందజేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొత్తగూడెంటౌన్: సింగరేణి కార్మిక ప్రాంతం గౌతంపూర్‌కాలనీకి చెందిన షేక్ మనీశ్ కనిపించకుండా పోయిన ఘటన శనివారం కొత్తగూడెం టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గౌతంపూర్‌కాలనీకి చెందిన షేక్ మనీశ్ ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండటంతో తల్లి మహబూబా, అతని భార్య 8 నెలలుగా దూరంగా ఉంటున్నారు. ఏదైనా పని చేసుకోవాలని షేక్ మనీశ్‌కు చెప్పగా అలిగి ఈ నెల 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలీల వ్యాన్ బోల్తా

కూసుమంచి: మండలంలోని దుబ్బతండా వద్ద శనివారం కూలీలతో వెళ్తున్న వ్యాను అదుపు తప్పి పొలాల్లో బోల్తా కొట్టింది. సమీప సూర్యాపేట జిల్లాలోని నేరేడువాయితండా కూలీలు వ్యాన్‌లో మండలంలోని లాల్‌సింగ్‌తండా వెళ్తున్నారు. ఈ క్రమంలో దుబ్బతండా వద్దకు రాగానే వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో వ్యానులో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

మొక్కజొన్నకే మొగ్గు

- జీరో టిల్లేజీ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు
- వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటపై ఆసక్తి
- యాసంగి సీజన్ ఆలస్యం, తక్కువ సాగు ఖర్చులు కూడా కారణమే..



మొక్కజొన్న పంటకు ఎరువు వేస్తున్న రైతు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులు జీరో టిల్లేజీ(దుక్కి లేకుండా మొక్కజొన్న సాగు)వైపు మొగ్గు చూపుతున్నారు. వానాకాలం వరి కోతలు ఆలస్యం కావడంతోపాటు దిగుబడి త్వరగా వచ్చే అవకాశం ఉండటంతో అన్నదాతలు మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. యాసంగిలో మళ్లీ వరి వేస్తే దిగుబడికి ఎక్కువ సమయం పడుతుంది. అదే మొక్కజొన్న అయితే నాలుగు మాసాల్లో చేతికొస్తుంది. దుక్కి లేకుండానే గత సీజన్‌లో సాగు చేసిన పంట మోళ్లు ఉండగానే మొక్కజొన్న సాగు చేయడంతో పెట్టుబడి ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. నేలకోత, పంటకాలం తగ్గుతుంది. సాగునీటి అవసరం, కలుపు బెడద తక్కువగా ఉంటుంది. వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో రైతులు మొక్కజొన్న సాగువైపు దృష్టి సారిస్తున్నారు.

రైతుల ఆసక్తి..

యాసంగి సీజన్‌లో జిల్లాలో వివిధ పంటల సాధారణ విస్తీర్ణం 2,15,463 ఎకరాలుగా అధికారులు అంచనా వేశారు. వరి 78,762 ఎకరాల సాగు విస్తీర్ణం కాగా ఇప్పటివరకు 12,971 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 26,156 ఎకరాలు కాగా 11,447 ఎకరాల్లో ఇప్పటికే విత్తనాలు వేశారు. మొక్కజొన్నకు గత సీజన్‌లో మద్దతు ధర లభించడంతో రైతులు ఈసారి కూడా ఆసక్తి చూపుతున్నారు. 2021లో మద్దతు ధర రూ.1,870 ఉండగా, 2022లో రూ.1,962 ధర లభించింది. సీజన్ ముగిసే సమయానికి గతం కంటే మొక్కజొన్న పంట విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరి ఆశించిన స్థాయిలో వేయకపోవడంతో అనివార్యంగా రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 11,447 ఎకరాల్లో (36 శాతం) సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

విస్తీర్ణం పెరుగుతోంది



జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువగా ఖర్చులేని, తక్కువ సమయంలో చేతికి వచ్చే మొక్కజొన్న వైపు దృష్టి సారిస్తున్నారు. లాభదాయకమైన పంట. ఆయిల్‌పామ్ వైపు కూడా రైతులు మక్కువ చూపుతున్నారు.

– కొర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

తక్కువ పెట్టుబడి..



వానాకాలం పంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో వరి దిగుబడులు ఆలస్యమయ్యాయి. అందుకే వరి కోతలు కాగానే ఎక్కువగా పెట్టుబడి ఖర్చు లేని, స్వల్పకాలంలో దిగుబడి వచ్చే మొక్కజొన్న వేశాను. పంట చేతికొచ్చాక చొప్ప పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది.

– రాయపూడి శ్రీనివాస్, రైతు, చాతకొండ

మండలాల వారీగా మొక్కజొన్న సాగు (ఎకరాల్లో..)

మండలం	విస్తీర్ణం	మండలం	విస్తీర్ణం
అన్నపురెడ్డిపల్లి	32	కొత్తగూడెం	26
అశ్వారావుపేట	206	లక్ష్మీదేవిపల్లి	109
చండ్రుగొండ	32	పాల్వంచ	69
దమ్మపేట	3,400	సుజాతనగర్	3
ములకలపల్లి	81	ఆళ్లపల్లి	139
చర్ల	2	గుండాల	486
దుమ్ముగూడెం	3	టేకులపల్లి	369
జూలూరుపాడు	18	ఇల్లెందు	6,472

కార్యకర్తలు లేనిదే పార్టీ లేదు..

బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ నామ

దమ్మపేట: కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, వారు లేనిదే పార్టీ లేదని బీఆర్‌ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేట మండలం నల్లకుంట గ్రామానికి చెందిన 25 మంది యువకులు దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన దిశ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు గారపాటి సూర్యం నాయకత్వంలో శనివారం ఖమ్మంలోని నామ స్వగృహంలో ఎంపీ నామ నాగేశ్వరరావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎంపీ నామ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు లేనిదే పార్టీ లేదని, వారు పార్టీకి పునాదులు, సేనాధిపతులని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తెలంగాణ మోడల్ పథకాలు అమలు చేయాలనే ఆలోచనతోనే కేసీఆర్ బీఆర్‌ఎస్‌ని స్థాపించారని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చమటోడ్చి పని చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో న్యాయవాది సోడెం వెంకట్, అద్దంకి మధు, కనపర్తి ధర్మారావు, సీహెచ్ భాగ్యరాజు, నందికోల రామారావు, మద్దెల పుల్లారావు, ఐనంపూడి సంతోష్, ఎడవల్లి కుమార్, తోట గోపి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నల్ల మల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, గోడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వచ్చి మృత్యు ఒడికి

మిర్యాలగూడటౌన్: పొట్టకూటి కోసం జిల్లాకు వచ్చిన ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృత్యు ఒడికి చేరగా మరొకరు గాయపడ్డారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వెంకటాద్రిపాలెం శివారులో శనివారం చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో నూతనంగా పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే, బంక్‌కు విద్యుత్ సరఫరా కోసం కాంట్రాక్టర్ ప్రత్యేక లైన్‌తో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నాడు. అందుకు స్తంభాలకు విద్యుత్ వైర్లు బిగించేందుకు కార్మికులుగా ఖమ్మం జిల్లాకు చెందిన రాము అనే మేస్త్రీ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కోరం బుజ్జి (40)తో పాటు మరో ఐదుగురు మిర్యాలగూడకు వచ్చారు. కాంట్రాక్టర్ విద్యుత్ అధికారులతో మాట్లాడి ఎల్‌సీ తీసుకోగా కోరం బుజ్జి, కృష్ణ స్తంభాలపై వైర్లు బిగిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో కోరం బుజ్జి, కృష్ణ స్తంభాల పైనుంచి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన బుజ్జి అక్కడికక్కడే మృతిచెందగా కృష్ణ ఆస్పత్రిలో కోలుకుంటున్నాడు. మృతుడి బంధువులు రాత్రి వరకు రాలేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపారు.

మధిర మండలంలో పొంగులేటి పర్యటన



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న పొంగులేటి

మధిర: మండలంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించారు. శ్రీరస్తు ఫంక్షన్‌హాల్లో జరుగుతున్న ముక్కర లక్ష్మారెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావూరి శ్రీనివాసరావు, వంగవీడు గ్రామంలో ఐలూరి జనార్దన్‌రెడ్డి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా ఆయనను పరామర్శించారు. శీలం గోపాలరెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మ మృతి చెందగా దశదినకర్మకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, తుళ్లూరు బ్రహ్మయ్య, కోట రాంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, ఎర్రగుంట రమేశ్, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొంగులేటిని సత్కరిస్తున్న గ్రేస్ కళాశాల సిబ్బంది

ఇష్టపడి చదవండి..

కొణిజర్ల: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం తనికెళ్లలోని గ్రేస్ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఎంఎల్‌టీ గ్రూపు విద్యార్థుల ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, గుండ్ల కొటేశ్వరరావు, గడల నరేంద్రనాయుడు, కనగంటి రావు, మోష రామకోటయ్య, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ డీఎస్పీగా వెంకటేశ్ నియామకం



పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్

పాల్వంచ/కొత్తగూడెంటౌన్: పాల్వంచ డీఎస్పీగా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్తుపల్లి డీఎస్పీగా పనిచేస్తున్న ఎన్.వెంకటేశ్ పాల్వంచ డీఎస్పీగా నియామకయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పోలీస్ నుంచి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు కూడా బదిలీ అయ్యారు. వరంగల్ ఏసీబీ (సీఎస్పీ)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌కే అబ్దుల్ రెహమాన్‌కు కొత్తగూడెం డీఎస్పీగా పోస్టింగ్ కల్పించారు. పాల్వంచ డీఎస్పీ సత్యనారాయణ, కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబులను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

సీనియర్ నాయకుడు దయానంద్‌కు గుండెపోటు

పెనుబల్లి: సత్తుపల్లికి చెందిన సీనియర్ నాయకుడు, దిశ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ శనివారం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. పెనుబల్లి మండలంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా కుప్పకూలి పడిపోయారు. దీంతో ఆయన అభిమానులు, స్థానికులు వెంటనే డాక్టర్ దయానంద్‌ను కారులో సత్తుపల్లికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షల అనంతరం ఖమ్మం, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు లక్కింశెట్టి శ్రీనివాసరావు (45)కు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసరావు కుమారుడు సాయికి ఇటీవల అశ్వారావుపేట మండలానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వధువు ఇంటి వద్ద జరిగే ఫంక్షన్‌కు కుటుంబ సభ్యులు ముందుగానే వెళ్లారు. తరువాత శ్రీనివాసరావు ఒక్కడే ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో ములకలపల్లి మండలం కొత్తగంగారం శివారు అటవీ ప్రాంతంలో రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో శ్రీనివాసరావు తలకు తీవ్ర గాయమైంది. ఈ ఘటన అటవీ ప్రాంతంలో జరగడంతో ఎవరూ గమనించక లేదు. తీవ్ర రక్తస్రావం అయ్యింది. తరువాత మార్గంలో వచ్చే వారు 108 వాహనానికి సమాచారం ఇవ్వండంతో సిబ్బంది హుటాహుటిన పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మానికి తరలిస్తుండగా శ్రీనివాసరావు మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడు శ్రీనివాసరావు కుమారుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

భర్తపై అట్రాసిటీ కేసు

పాల్వంచరూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఒక బిడ్డ పుట్టిన తర్వాత వేధింపులు ఎక్కువయ్యాయని ఓ వివాహిత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాండురంగాపురం గ్రామానికి చెందిన అజ్మీర శిరీష 2020 సంవత్సరంలో ఎస్‌కే నవాబ్‌పాషాను ప్రేమించి పెళ్లి చేసుకుంది. రెండేళ్లుగా కలిసి జీవించారు. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన భర్త అదనపు కట్నం కోసం నిత్యం వేధిస్తున్నాడని బాధితురాలు తెలిపింది. రెండు నెలల కిందట ఇంటి నుంచి బయటకు పంపించాడని, కులం పేరుతో దూషించాడని శనివారం శిరీష పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్తపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

భవనం.. అలంకార ప్రాయమే!

- గిరిజన భవనం ప్రారంభించి వదిలేసిన వైనం
- అద్దెకు ఇస్తే ఆదాయం వస్తుందని తెలిసినా నిర్లక్ష్యం
- అడ్డాగా మార్చుకుంటున్న మందుబాబులు



అన్ని హంగులతో నిర్మించిన గిరిజన సంక్షేమ భవనం



భవనం డోర్ వద్ద మద్యం సీసా

ఖమ్మం మయూరిసెంటర్: ఖమ్మం జిల్లా కేంద్రంలో గిరిజనుల కోసం నిర్మించిన భవనం అలంకారప్రాయంగా మారింది. గిరిజనుల సమావేశాలు, శుభకార్యాలకు, ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందనే భావనతో ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధులు కేటాయించింది. అనేక అవాంతరాల నడుమ నిర్మాణం పూర్తయిన గిరిజన సంక్షేమ భవనాన్ని గతేడాది మే 24న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ప్రారంభించిన రోజు వేసిన తాళం మళ్లీ తీయకపోవడంతో భవనం నిరుపయోగంగా మారింది. భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పించపోగా.. నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండం గమనార్హం.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

గిరిజన సంక్షేమ భవనం నిర్వహణ బాధ్యతలు చూస్తూనే.. అందులో గిరిజనులు, గిరిజనేతరులు సమావేశాలు, ఫంక్షన్లు నిర్వహించుకునేలా అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు భవనం తమ పరిధిలోనిది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇక వాచ్‌మెన్‌కు సైతం భవనం వద్ద కాకుండా గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద విధులు కేటాయించడంతో పట్టించుకునే వారే కరువయ్యారు. ఇదే అదునుగా తీసుకున్న పలువురికి సాయంత్రమైతే చాలు ఇక్కడ మద్యం సేవించడం అలవాటుగా మారింది. దీంతో గిరిజన సంక్షేమం పేరిట నిర్మించిన భవనం అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అద్దెకు ఇస్తే ఆదాయం, అభివృద్ధి

ఎస్సీలకు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనం నిర్మించినట్లుగానే గిరిజనుల కోసం గిరిజన సంక్షేమ భవనాన్ని ప్రభుత్వం నిర్మించింది. రూ.కోటికి వెచ్చించగా ఇప్పటి వరకు అద్దెకు ఇవ్వలేదు. గిరిజనుల అవసరాలకైతే రూ.10 వేలు, గిరిజనేతులకు ఇస్తే రూ.15 వేలు వసూలు చేయాలని శాఖ అధికారులు నిర్ణయించారు. వస్తు ప్రదర్శనలు, బుక్‌ఫెయిర్లు, ఫంక్షన్లు, సమావేశాలకు అద్దెకు ఇవ్వనున్నట్లు విస్తృతంగా ప్రచారం చేస్తే ఆదాయం సమకూరేది. అంతేకాక నిర్వహణ, అభివృద్ధి సులువయ్యేది. కానీ ఆ దిశగా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదాయం కోల్పోతున్నట్లవుతుందని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి.

అద్దెకు ఇస్తాం..

ఖమ్మంలో నిర్మించిన గిరిజన సంక్షేమ భవనాన్ని ఫంక్షన్లు, ప్రదర్శనలు, సమావేశాల కోసం ఎవరైనా ఆసక్తి చూపిస్తే అద్దెకు ఇస్తాం. భవనం చుట్టూ ప్రహరీ సరిగ్గా లేదు. ఇందు కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రాత్రి వేళ విధులు నిర్వర్తించేలా వాచ్‌మెన్‌ను నియమించాం.

– కృష్ణనాయక్, ఎస్టీ డీడీ, ఖమ్మం